సాక్షి
కాకినాడ

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



రూ.లక్ష సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు నండూరి వెంకట గంగారాజశేఖర్ (దినకొండేపూడి) ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి వాస్తవ్యులు శనివారం రూ.25,116 విరాళంగా అందించారు.

వక్రతుండాయ.. బహురూపాయ



వక్రతుండ మహాకాయ.. కోటి సూర్య సమప్రభ.. నిర్విఘ్నం కురుమేదేవ.. సర్వకార్యేషు సర్వదా.. అంటూ బొజ్జ గణపయ్యను అంతా కొలిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో▸

న్యూస్‌రీల్

నిండుకుండలా 'ఏలేరు'

- దిగువకు 7500 క్యూసెక్కుల విడుదల
- 21.38 టీఎంసీల నీటినిల్వలు



ఏలేరు గేట్ల నుంచి విడుదల చేస్తున్న నీరు

ఏలేశ్వరం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు జలాశయం నిండుకుండలా ఉంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా దిగువ ప్రాంతానికి 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సామర్థ్యం వరకు పెరిగితే నీటిని వదిలేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రస్తుతం ఎగువప్రాంతం నుంచి 15.255 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి చేరుతున్నది. దీంతో ఆదివారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.20 మీటర్లు, 24.11 టీఎంసీలకు 21.38 టీఎంసీలకు నీటినిల్వలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు మాత్రమే 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తాండవ నుంచి 1238 క్యూసెక్కుల విడుదల

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి రెండు స్పిల్‌వే గేట్లు ఎత్తి 1238 క్యూసెక్కుల నీటిని సముద్రానికి విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈఈ పి. అనురాధ ఆదివారం తెలిపారు. జలాశయ గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా 378.4 అడుగులకు నీటి మట్టం ఉందన్నారు. జలాశయానికి 826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, ప్రాజెక్టు భద్రత దృష్ట్యా ఇన్‌ఫ్లో ఆధారంగా సముద్రానికి నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

పీజీఆర్ఎస్ రద్దు

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లాలో ఈ నెల 9వ తేదీ సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

కాకినాడ సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

పోలీస్ స్పందన రద్దు

కాకినాడ క్రైం: భారీ వర్షాల వల్ల సోమవారం నిర్వహించాల్సిన పోలీస్ స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బతుకులకీ లంగరు!

కాలధర్మం గతి తప్పింది. కాలగతులు చకచకా మారిపోతున్నాయి. ఎండా కాలంలో వర్షాలు.. తుపానులు.. శీతాకాలంలో విపరీతమైన ఎండలు.. వర్షాకాలంలో వానలు పడకపోవడం.. ఇది ఈ కాలం అని చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి, శీతాకాలాల్లో ఏమాత్రం అల్పపీడనాలు.. తుపానులు.. వాయుగుండాల ప్రకటనలు వెలువడినా ఆ ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా మొట్టమొదట పడేది మత్స్యకారులపైనే. వాతావరణ శాఖ ప్రకటన వెలువరించగానే వెంటనే అధికారులు మత్స్యకారులకు వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేసేస్తారు. ఇలా ఏడాదిలో దాదాపు ఓ పది హెచ్చరికలు జారీ అయ్యాయనుకుంటే సుమారు నాలుగైదు రోజుల చొప్పున 50 రోజులు వేట ఉండదు. పడవలకు లంగరేయడం.. ఆకాశం ఎప్పుడు తేటపడుతుందా అని గంగపుత్రులు నింగి వైపు ఆశగా ఎదురుచూడడం పరిపాటి. దీనికి తోడు చేపలు గుడ్లుపెట్టి పిల్లలయ్యే కాలంలో సహజంగానే మత్స్యశాఖ 60 రోజుల పాటు వేట నిషేధాజ్ఞలు జారీ చేస్తుంది. ఇలా ఏడాదిలో అటూ ఇటుగా సుమారు 110 రోజులు వేట ఉండదు. మిగిలిన రోజుల్లోనే వారికి వేటా.. వ్యాపారం. ఆ రోజుల్లో సంపాదించిందే వేటలేని రోజులకు సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి వారిది. వేటపై ప్రభుత్వమే నిషేధాజ్ఞలు ప్రకటించే 60 రోజుల కాలానికి పరిహారం ప్రకటించి ఆదుకుంటుంది. తాజాగా కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి మూడు నెలలైనా నేటికీ నిషేధ కాలం నాటి పరిహారం విడుదలచేయలేదు. దీంతో ప్రస్తుతం పస్తులుండక తప్పని పరిస్థితి వారిది.



వేట లేక వలలు బాగుచేసుకుంటున్న మత్స్యకారులు

- మత్స్యకారులకు దక్కని భరోసా
- తుపానుతో వేటకు విరామం
- గుమ్మం దాటని మత్స్యకారులు
- పొట్టగడిచేదెలా అని ఆందోళన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వేటా లేదు సాపాటు లేదు అన్నట్టు తయారైంది వారి ప్రస్తుత పరిస్థితి. సముద్ర వేటే జీవనాధారంగా జిల్లాలో ఉన్న వేలాది గంగపుత్రుల కుటుంబాలు తుపానుతో గుమ్మం దాటలేక ఇంటికే పరిమితమవ్వాల్సి వస్తోంది. సముద్ర తీరంలో బోట్లకు లంగరేసి వాతావరణం ఎప్పుడు అనుకూలిస్తుందా అని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లా యంత్రాంగం సముద్రంపైకి వేటకు వెళ్ల వద్దని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో గడచిన రెండు వారాలుగా వేటకు వెళ్లలేక పొట్ట గడవడమే గగనమై జీవితాలకు సైతం లంగరు వేసినట్టు స్తంభించిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఉపాధి లేక రోడ్డున పడకుండా కూటమి ప్రభుత్వం నిషేధ కాలం నాటి నష్ట పరిహారం అందించకుండా చేతులెత్తేయడంతో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2019 నుంచి క్రమం తప్పకుండా వేట నిషేధ పరిహారాన్ని జగన్ ప్రభుత్వం అందించి ఆపద సమయంలో ఆదుకుంది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేటపై నిషేధం అమలులో ఉంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా అందించింది. గత మే నెలలో వేట నిషేధ కాలంలోనే సార్వత్రిక ఎన్నికలు ఉండడంతో పరిహారాన్ని అందించలేక పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా వారికి చిల్లి గవ్వ కూడా పరిహారం అందివ్వకుండా చేతులెత్తేయడం వేలాది కుటుంబాలకు పస్తులుండే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆ పరిహారం అందించి ఉంటే ప్రస్తుత తుపానుల కాలంలో పస్తులుండాల్సి వచ్చేదికాదని మత్స్యకారులు అంటున్నారు. నాలుగేళ్లుగా ఏటా జూన్, జూలై నెలల్లోనే పరిహారం అందించడంతో ఆ తరువాత తుపానులతో వేట లేకున్నా ఆ కుటుంబాలు ఇంటిపట్టునే ఉన్నప్పటికీ జీవనోపాధికి సరిపడా నిత్యావసరాలు సిద్ధంగా ఉంచుకునే వారు. అటువంటిది ఈ సారి పరిహారం అందకపోవడం, ఇప్పుడేమో వారం తిరగకుండా రెండోసారి తుపాను వచ్చి పడటంతో జీవనోపాధి కోల్పోయి మత్స్యకారులు లబోదిమంటున్నారు.



తుపాను కారణంగా రామన్నపాలెం ఉప్పటేరు తీరానికి చేరిన బోట్లు

జిల్లాలో తీరప్రాంత మండలాలు	– 5
మత్స్యకార గ్రామాలు	– 36
మెరైన్ ఫిషర్‌మెన్ పాపులేషన్	– 2 లక్షలు
వేట జీవనోపాధిగా ఉన్నవారు	– 36 వేలు
మెకనైజ్డ్ బోట్లు	– 467
మోటారు బోట్లు	– 3779
సంప్రదాయ బోట్లు	– 399
మొత్తం బోట్లు	– 4645

మత్స్యకార భరోసాగా ప్రతి కుటుంబానికి రూ.10 వేల చొప్పున గత ఐదేళ్లలో అందిన లబ్ధి ఇలా..

2019–20లో	– 23,190 మందికి రూ.23.19 కోట్లు
2020–21లో	– 24,587 మందికి రూ.24,587 కోట్లు
2021–22లో	– 30,213 మందికి రూ.30,213 కోట్లు
2022–23లో	– 21,394 మందికి రూ.21,394 కోట్లు
2023–24లో	– 24,147 మందికి రూ.24,147 కోట్లు

కూటమి సర్కార్ నిర్వాకంతో మత్స్యకారులకు భరోసా లభించలేదు సరికదా ఈ పథకానికి తయారైన లబ్ధిదారులు జాబితాపై మరోసారి పరిశీలన పేరుతో ఇంతవరకు చిల్లిగవ్వ విదల్చలేదు. కాకినాడ జిల్లాలో తుని నుంచి తాళ్లరేవు వరకు సుమారు 94 కిలో మీటర్ల మేర సముద్ర తీరంలో 7 తీర ప్రాంత మండలాలు పరిధుల్లో 1,95,184 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో సముద్ర వేట ద్వారా 36,101 మంది ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో 410 మెకనైజ్డ్, 3732 మోటరైజ్డ్ బోట్లు, 287 సంప్రదాయ పడవల ద్వారా సముద్రంలో చేపలు వేట సాగిస్తున్నారు. 4429 బోట్లకు గాను 25,419 మంది లబ్ధిదారులను మత్స్యకార భరోసా పథకం కింద తొలుత ఎంపిక చేసిన కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుగా 4290 మందిని అనర్హులుగా మత్స్యశాఖ ద్వారా ప్రాథమికంగా నిర్ధారించి, 21,129 మందిని అర్హులుగా లెక్క తేల్చారు.

వేట నిషేధ జీవన భృతిగా కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.20 వేలు వస్తాయని మత్స్యకారులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంతకు ముందున్న టీడీపీ ప్రభుత్వం కంటే రూ.6 వేలు కలిపి రూ.10 వేలు చొప్పున అందించింది. కూటమి సర్కార్ రెట్టింపు ఇస్తామని హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఆ ప్రస్తావన లేకపోవడమే కాకుండా ఇప్పుడు తుపానుతో వేటకు విరామం ప్రకటించడంతో పొట్టగడిచేదెలా అని మత్స్యకారులు లబోదిబోమంటున్నారు.

వేట లేకపోతే పొట్టగడిచేదెలా



వేట నిషేధ పరిహారం సకాలంలో అందించి ఉంటే ఈ రోజు తుపానుతో వేట లేకున్నా పొట్టగడిచేది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న నాలుగేళ్లు కూడా సకాలంలో పరిహారం అందించి ఆదుకున్నారు. ఆ డబ్బు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితుల్లో బాగా ఉపయోగపడేది.ఈ సీజన్‌లో వేట నిషేధ పరిహారాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. ఇప్పటికైనా పరిహారాన్ని అందించాలి.

– చొక్కా ఏసేబు, మత్స్యకారుడు, కొత్తపల్లి

సకాలంలో పరిహారం ఇచ్చేవారు



గత ప్రభుత్వం సకాలంలో పరిహారం అందించి ఆదుకుంది. సమయానికి అందించడంతో జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఉండేది. ఇప్పటి ప్రభుత్వంలో పరిహారాన్ని అందించడంలో జరుగుతున్న జాప్యం వేటపై ఆధారపడ్డ తమలాంటి కుటుంబాలకు ప్రాణ సంకటంగా మారింది. మత్స్య సంపద లభించక, పరిహారం అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– వంకా ప్రసాద్, మత్స్యకారుడు, ఉప్పాడ

సింగిల్ విండో అంటూ...డబుల్ మాట!

- వినాయక మంటపాల అనుమతిలో మాట మార్చిన ప్రభుత్వం

పిఠాపురం: సింగిల్ విండో విధానం అంటూ వినాయక మంటపాల ఏర్పాటుకు డబ్బులు వసూలు చేసిన ప్రభుత్వం హిందూ సంఘాల వ్యతిరేకతతో మాట మార్చింది. విగ్రహాల పరిమాణాన్ని బట్టి డబ్బు కట్టి మంటపానికి అనుమతి తీసుకోవాలని స్వాక్షాత్తూ రాష్ట్ర హోం మంత్రి ప్రకటించడంతో తాము అనుమతులు పొందామని మంటపాల నిర్వాహకులు చెబుతున్నారు. 'చవితికి చంద్ర గ్రహణం' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమవడంతో ఆమె మాట మార్చినట్టు స్పష్టమవుతోంది. పది రోజుల క్రితమే ఎవరి దగ్గరా డబ్బులు వసూలు చేయవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని హోంమంత్రి చెప్పడం గమనార్హం. తీరా చూస్తే ఐదు రోజుల నుంచి ప్రతీ మంటపానికి రూ.1,050 నుంచి రూ.1,500 వరకు వసూలు చేశారు. దీంతో రాష్ట్రం అంతా వినాయక మండపాల నిర్వాహకులతో పాటు హిందూ మతానికి చెందిన సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తప్పించుకునే ప్రయత్నంలో హోంశాఖా మంత్రి మాట మార్చి ఈ విధానం గత ప్రభుత్వ హయాంలో వచ్చిందని దానిని గత 20 రోజుల క్రితం తన దగ్గరకు అధికారులు తెస్తే చూసి సీఎం చంద్రబాబుకు చెబితే ఆయన దానిని అమలు చేయవద్దని చెప్పారని అన్నారు. దీంతో గత 10 రోజుల క్రితమే ఎవరి దగ్గరా డబ్బులు వసూలు చేయవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పుకొచ్చారు. తాను పాత జీఓను బట్టి మాట్లాడిన మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నెపం నెట్టే ప్రయత్నం చేశారు. దీనిపై హిందూ సంఘాలు మండి పడుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా హోంమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తాము కట్టిన చలానాలను పెట్టి మరీ నిలదీస్తున్నారు.

10 రోజుల క్రితం చెబితే డబ్బు ఎందుకు వసూలు చేశారు?

10 రోజుల క్రితం చెబితే ఐదు రోజులుగా డబ్బు ఎందుకు వసూలు చేశారో చెప్పాలి. వినాయక మంటపాల నిర్వాహకుల నుంచి ఐదు రోజులుగా పోలీసులు ముక్కుపిండి మరీ డబ్బు వసూలు చేస్తూ చలానాలు తీస్తేనే అనుమతి అంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చినప్పుడు తెలియదా? ఆన్‌లైన్‌లో అనుమతులు ఇస్తుండగా ఎందుకు ఆపలేకపోయారు. ఎవరి దగ్గరా ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదంటూ హోంమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉంది. ప్రతి మంటపానికి డబ్బు కట్టే అనుమతులు తెచ్చుకున్నాం. 2022లో అప్పటి ప్రభుత్వం జీఓ ఇచ్చినట్టు హోంమంత్రి చెప్పడం పచ్చి అబద్ధం. అప్పుడు ఎవరూ డబ్బులు వసూలు చేయలేదు. 'సాక్షి'లో దీనిపై కథనం రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా హిందువులు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. దీంతో చేసేదేమీ లేక ఇలా మాట మార్చి ఎదుటి వారిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే 360 మంటపాలకు చలానాలు కట్టించుకున్నారు. కానీ ఎక్కడా రూపాయి కట్టించుకోలేదనడం పచ్చి అబద్ధం. ఇప్పటికైనా కట్టించుకున్న డబ్బు వెనక్కి ఇవ్వాలి.

– వెంకటేశ్వరరావు, విశ్వ హిందూ పరిషత్ నాయకుడు, పిఠాపురం

అధికారులూ.. అప్రమత్తం : కలెక్టర్

కాకినాడ సిటీ: ఏలేరు ప్రాజెక్టు నుంచి ఐదు వేల క్యూసెక్కుల మించి నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా ఏలేరు, సుద్దగడ్డ వాగు ప్రభావిత మండలాల్లో తహసీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో తహసీల్దార్లు, వీఆర్వోలు తమ హెడ్ క్వార్టర్‌లోనే ఉండి ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గట్లు తెగే అవకాశం ఉన్న చెరువులు, గండ్లకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంత పరిధిలోని గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలను ముందుగానే ఆసుపత్రులకు తరలించడంతో పాటు, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది 24 గంటలు పని చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా విషయంలో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

జిల్లాలో రానున్న 4, 5 రోజుల్లో భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలోను, మండల తాహసీల్దార్ల కార్యాలయాల్లోను 24/7 కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆదివారం తెలిపారు. అవసరమైన ప్రజలు కాకినాడ కలెక్టరేట్‌లో 18004253077, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 9849903920 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

హడలెత్తిస్తున్న చిరుత

- పుకార్ల వ్యాప్తితో మరింత ఆందోళన
- తీవ్రంగా గాలిస్తున్న అటవీ సిబ్బంది

రాజానగరం: లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తోందనే ప్రచారం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. దీనికి తోడు అదిగో పులి అంటే ఇదిగో తోక అనే వారు చేసే పుకార్లతో లాలాచెరువు నుంచి రాజానగరం వరకు జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. లాలాచెరువులోని గోదావరి మహాపుష్కర వనం సమీపంలో గురువారం రాత్రి చిరుతపులి ఒక జంతువును నోట కరుచుకుని అటవీ సిబ్బంది క్వార్టర్ల వైపు వెళ్లిందనే ఓ ప్రయాణికుని సమాచారం అటు అటవీ శాఖలోను, ఇటు ప్రజల్లోనూ అలజడి రేపింది. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు వాస్తవాలను తెలుసుకునే పనిలో పడ్డారు. శుక్రవారం రాత్రి అదే ప్రాంతంలో ఉన్న ఆకాశవాణి కేంద్రం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో ఒక పందిని వెంబడిస్తూ చిరుత వెళ్లడం రికార్డవడంతో దాని సంచారం రూఢీ అయ్యింది. దీంతో పులిని త్వరగా పట్టుకునేలా జిల్లా అటవీ అధికారి భరణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

జాతీయ రహదారిపై బిక్కుబిక్కుమంటూ..

చీకటి పడితేచాలు ఏ ఒక్కరూ ఒంటరిగా బయటకు రావొద్దంటూ అటవీ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో లాలాచెరువు నుంచి దివాన్‌చెరువు వరకు ఉన్న జాతీయ రహదారిపై ప్రయాణించే వారు భీతిల్లుతున్నారు. లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాల్లో జాతీయ రహదారిని ఆనుకుని 534.18 హెక్టార్లలో రిజర్వు ఫారెస్టు ఉండటంతో ఆ పరిసరాలలో నివసిస్తున్నవారు కూడా ఏ సమయాన ఏం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు.

పులి కన్నా భయపెడుతున్న పుకార్లు

లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాల్లో చిరుత సంచారం నేపథ్యంలో సోషల్ మీడియాలో పుకార్లు చురుగ్గా వ్యాపిస్తున్నాయి. గాయలతో ఉన్న యువకుడి ఫొటో వేసి చిరుత దాడిలో గాయపడినట్టుగా కథ అల్లేశారు. అలాగే రాజానగరం శివారు సూర్యారావుపేటలో శనివారం రాత్రి చిరుత ఒక మేకను నోట కరుచుకుపోయిందంటూ ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వాస్తవాన్ని నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది.



పులి కాలిముద్రలు చూపుతున్న డీఎఫ్ఓ భరణి

ఎటునుంచి ఎలా వచ్చింది!

జన సాంద్రత అధికంగా ఉండే లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాలకు పులి ఎలావచ్చిందనేది చర్చనీయాంశమైంది. రిజర్వు ఫారెస్టు ఉండటం వల్ల వచ్చి ఉండవచ్చని, అది కూడా అడ్డతీగల ప్రాంతం నుంచి మల్లిసాల మీదుగా ఇవి రావడానికి అవకాశాలున్నాయనే వాదన కూడా వినిపిస్తుంది. అంతేకాక గతంలో 2008, 2011, 2018లలో మూడు పర్యాయాలు రాజమండ్రిలో చిరుతపులులు సంచరించి, జనాన్ని హడలెత్తించాయంటున్నారు.

నగర వనం తాత్కాలికంగా మూసివేత

చిరుతపులి పట్టుకునే వరకు గోదావరి మహాపుష్కర నగర వనాన్ని 16వ తేదీ వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా అటవీశాఖ అధికారి భరణి ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. అలాగే చిరుత జాడ తెలుసుకుని త్వరగా పట్టుకునేలా 50 ట్రాప్ కెమెరాలను అమర్చి, నాలుగు ట్రాప్ బోన్లను అమర్చామన్నారు. ఆకాశవాణి కేంద్రం, ఆటోనగర్ ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టుగా తెలిసిందన్నారు.

అల్లాడిపోతున్న అన్నదాత

- జిల్లాలో 18 వేల ఎకరాల్లో వరిపొలాలు మునక
- గత నెలలో పంట నష్టం అందక అవస్థలు
- ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజల అవస్థలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకూ ఎడతెరిపి లేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. వరుస తుపానులు అన్నదాతకు కంటిమీద కునుకు పట్టనీయడం లేదు. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది 1.20 లక్షల ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. జులై నెలాఖరున సాగు మొదలుపెట్టినా నెల వ్యవధిలోనే వరుణుడు అన్నదాత దెబ్బ కొట్టాడు. వేసిన రెండు వారాల వ్యవధిలో వరి నాట్లు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కనీసం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వకపోవడంతో జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు రెండోసారి వరినాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 18 వేల ఎకరాల్లో వరిపంట పూర్తిగా పాడైందని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాకు వచ్చింది. జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో ప్రత్తి పంట నష్టపోయినట్లు అంచనా. ప్రస్తుతం వరి చిరుపొట్ట దశలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో తుని, తొండంగి, గొల్లప్రోలు, కిర్లంపూడి, జగ్గంపేట, సామర్లకోట, కాకినాడ రూరల్, పిఠాపురం, కరప మండలాల్లో వరిపంట చాలా వరకూ నీటిలో పూర్తిగా మునిగిపోయింది. మిగిలిన మండలాల్లో నీట నానుతోంది. గత నెలలో కురిసిన వర్షాలకు మెట్టప్రాంతంలో పెద్దగా ఇబ్బంది లేదు. కానీ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మెట్ట అక్కడి పొలాలు కూడా నీటమునిగిపోయాయి. ఏలేరు నీరు దిగువకు విడుదల చేయడంతో ఏలేరు ప్రాంతంలో ఉన్న మండలాల్లో అధికంగా వరిపంట నీట మునిగింది. దీంతో మరింత నష్టం పెరిగేలా ఉంది.



గొల్లప్రోలు సూరంపేటలో వరద ఉధృతి



గొల్లప్రోలులో సుద్దగడ్డ వరదతో నీట మునిగిన కాలనీ రహదారి


రౌతులపూడిలో 21.4 మిల్లీమీటర్ల వర్షపాతం

కాకినాడలో జిల్లాలో రౌతులపూడి మండలంలో అత్యధికంగా 21.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా సామర్లకోటలో 5.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రత్యేక బృందాల నియామకం

పంట నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు నియమించారు. మండలస్థాయిలో తహసీల్దార్, ఎండీఓ, మండల వ్యవసాయశాఖాధికారి నేతృత్వం పంట నష్ట అంచనాలు తయారుచేస్తున్నారు.

రెండురోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించాం



రెండురోజుల్లో పూర్తి స్థాయిలో పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశాం. అవి వచ్చిన తర్వాత కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాలతో ప్రభుత్వానికి పంపుతాం.

– ఎస్. విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

గొల్లప్రోలుకు వరద ముప్పు

- ఏలేరు నుంచి 4వేల క్యూసెక్కులు విడుదల
- పొంగి ప్రవహిస్తున్న కొండ కాలువ, సుద్దగడ్డ

పిఠాపురం: గొల్లప్రోలుకు వరద ముప్పు పొంచి ఉంది. ఆదివారం ఏలేరు నుంచి 4 వేల క్యూసెక్కుల అదనపు జలాలు విడుదల చేయడంతో పొంగి ప్రవహిస్తున్న కొండ కాలువ, సుద్దగడ్డ కాలువలు మరింత ఉధృతం కానున్నాయి. దీంతో గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు మండలానికి ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే వరద నీటిలో ఉన్న సూరంపేట మరింత మునిగిపోనుంది. వరుస వరదలు వాణిజ్య, వరి, సెరికల్చర్ పంటలను అతలాకుతలం చేస్తున్నాయి. సుద్దగడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు సూరంపేట వద్ద రహదారులు నీట మునగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల క్రితం వచ్చిన వరద నుంచి తేరుకుంటున్న తరుణంలో మళ్లీ వచ్చిన వరద ముంచెత్తింది. దీంతో సుమారు 1800 హెక్టార్లలలో వరి, పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు మునిగినట్టు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే సుద్దగడ్డ పొంగి పొర్లుతుండడంతో లోతట్టు కాలనీలు నీట మునిగి వీధులు చెరువులుగా మారుతున్నాయి.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రు గ్రామానికి చెందిన మానేపల్లి వెంకటలక్ష్మి (43) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. వద్దిపర్రు గ్రామానికి చెందిన మానేపల్లి గోవింద్‌తో వెంకటలక్ష్మికి ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. గోవింద్ రోజూ మద్యం తాగి హింసించడంతో వెంకటలక్ష్మి శనివారం సాయంత్రం పురుగు మందు తాగింది. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, దుర్గేష్, రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ పురందేశ్వరి


ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వీటిని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర క్రీడలు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నిర్వాహకులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం లక్ష్మీవారపుపేటలో ఫ్యాన్సీ సామాన్లతో తయారు చేసిన వినాయకుడు



నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో శ్రీపూజ గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద 16 అడుగుల విగ్రహం



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆకట్టుకున్న వినాయక విగ్రహం



కాకినాడ దిగుమర్తి వారి వీధిలో ధాన్యంతో తయారు చేసిన వినాయకుని ప్రతిమ



జగన్నాథపురం నేతాజీ పార్కు వద్ద 15 అడుగుల పంచదార వినాయక విగ్రహం

వక్రతుండాయ.. బహురూపాయ

- వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు
- ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటిన వేడుకలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ) /అమలాపురం టౌన్/ పిఠాపురం: వక్రతుండ మహాకాయ.. కోటి సూర్య సమప్రభ.. నిర్విఘ్నం కురుమేదేవ.. సర్వకార్యేషు సర్వదా.. అంటూ బొజ్జ గణపయ్యను అంతా కొలిచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వినాయక ఉత్సవ మంటపాలను వీధివీధినా ఏర్పాటు చేసి భక్తిని చాటారు. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద వినాయక మండపంలో ప్రతి ఏడాది ఒక ప్రత్యేక అవతారంలో స్వామి దర్శనమిస్తారు. ఈసారి పసుపు, కుంకుమలతో రూపొందించిన సృష్టి గణపతికి ఉత్సవ కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అక్కడ గణనాథుల బొమ్మల కొలువు అందర్నీ ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాజా మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి ఇక్కడ ఎంతో అట్టహాసంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే రాజమహేంద్రవరంలోని పలుచోట్ల భారీ విగ్రహాలను నెలకొల్పారు. చాగల్లులో తెలగా సంఘం, చాగల్లు, నెలటూరు వర్తక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నవరాత్ర ఉత్సవాలు నిర్వహించారు. ఆ రెండు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసి ఉత్సవాలకు నిండుతనం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు.



గోకవరంలో 18 వేల రుద్రాక్షలతో తీర్చిదిద్దిన గణనాథుడికి పూజలు

కోనసీమలో..

కోనసీమ జిల్లాలోని అమలాపురం పట్టణం వినాయక చలువ పందిళ్లకు పెట్టింది పేరు. షరాబుల పందిరి, గడియారం స్తంభం సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటైన చలువ పందిళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయినవిల్లి వినాయక స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం ఆకట్టుకుంది. అంబాజీపేట మండలం గంగలకుర్తి మలుపు వద్ద ఉన్న విజయ గణపతి ఆలయాన్ని 108 అరటి గెలలతో అలంకరించారు. రామచంద్రపురం పట్టణంలో బాలభక్త సంఘం 65వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో వినాయక పందిళ్లు భారీగా వెలిశాయి. మండపేట, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో కూడా వినాయక చవితి ఉత్సవాలు జరిగాయి. జిల్లాలో దాదాపు 1,800 వినాయక చవితి పందిళ్లకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి అనుమతులు జారీ అయ్యాయి. కొత్తపేటతో పాటు ఆ మండలంలోని వాడపాలెం, అవిడి గ్రామాల్లో పౌరాణిక నాటకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



రాజమహేంద్రవరంలో సృష్టి వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

కాకినాడ జిల్లాలో..

పిఠాపురం జై గణేష్ ఆలయంతో పాటు కాకినాడ సాలిపేట, తుని, జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక మండపాలను శనివారం ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను నిలిపారు. ఆదివారం అన్ని ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ దిగుమర్తివారి వీధిలో ధాన్యంతో 18 అడుగుల పొడవైన విగ్రహాన్ని నిలిపారు. జగన్నాథపురం నేతాజీ పార్కు వద్ద 1200 కిలోల పంచదారతో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గొల్లప్రోలులో 5 వేల రుద్రాక్షలు, గోకవరంలో 18 వేల పంచముఖ రుద్రాక్షలతో ప్రత్యేకంగా తయారు చేసిన వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. గోకవరం గుబ్బాలమ్మ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో రూ.1.40 లక్షలతో హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన 15 అడుగుల విగ్రహం ఆకర్షించింది.

ఏసీఏ కార్యదర్శిగా సతీష్‌బాబు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రా క్రికెట్ సంఘ (ఏసీఏ) కార్యదర్శిగా సామాజిక సేవా సభ్యుడు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఫౌండేషన్ ప్రతినిధి టి.హరిష్ ఆదివారం తెలిపారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఏసీఏ ప్రతినిధులు ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ క్రీడలపై తనకున్న మక్కువతో ఈ అత్యున్నత హోదాను అందిపుచ్చుకున్నానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి నైపుణ్యం ఉన్న క్రికెట్ క్రీడాకారులను వెలికి తీసి ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన నగరాలైన మంగళగిరి, కడప ప్రాంతాల్లో కూడా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు నాంది పలుకుతామని అన్నారు. సతీష్‌బాబును జిల్లా మాజీ క్రికెట్ సంఘ కార్యవర్గ సభ్యులు బాపిరాజు, సత్యనారాయణ, హరీష్, కిరణ్‌రాజు, కొండలరావు, జిల్లా బాలుర, బాలికల క్రికెట్ సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ తదితరులు అభినందించారు.

పెనుగుదురులో వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన లక్ష్మణరావు

కరప (కాకినాడ రూరల్): మద్యం మత్తులో వాగ్వాదం ఓ వ్యక్తి ప్రాణాలను తీసింది. కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం తుమ్మలపల్లి లక్ష్మణరావు (50) దారుణ హత్యకు గురయ్యారు. కరప పోలీసుల కథనం ప్రకారం.. పెనుగుదురు గ్రామ శివారు రైస్‌మిల్లు ఎదురుగా లక్ష్మణరావుతో పాటు అదే గ్రామానికి మరికొంత మంది మద్యం తాగుతుండగా, ఇందులో రాంబాబుతో వాగ్వాదం చోటుకుంది. రాంబాబు, లక్ష్మణరావుల మధ్య గొడవ తీవ్ర ఆవేశానికి దారితీసింది. ఈ నేపథ్యంలో లక్ష్మణరావు పీకపై కత్తితో రాంబాబు కోశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో లక్ష్మణరావును కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉండగా అమ్మాయిలకు పెళ్లిళ్లు చేశాడు. నిందితుడు గతంలోనే ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడడం, ఆ కేసులో కండీషన్ బెయిల్‌పై తిరుగుతున్నట్టు తెలిసింది. సంఘటన స్థలాన్ని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, రూరల్ సీఐ చైతన్యకృష్ణ పరిశీలించారు. ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు. హత్యకు మద్యం మత్తులోనే వాగ్వాదం దారితీసిందా మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మి

రావులపాలెం: స్థానిక బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం తిరుపతిపురానికి చెందిన కంబాల లక్ష్మి (58) తన కుమార్తె ఇల్లు ఆత్రేయపురం మండలం వాడపల్లికి వచ్చింది. తిరిగి కొడుకు ఇంటికి వెళ్లేందుకు రావులపాలెం బస్టాండ్‌కు బయలు దేరింది. వాడపల్లి నుంచి ఆమె అల్లుడు మోటార్ సైకిల్‌పై తీసుకువచ్చి బస్టాండ్ వద్ద దించి వెళ్లాడు. అయితే అత్తిలి బస్సు ఎక్కేందుకు బస్టాండ్ లోపలకు వెళుతున్న లక్ష్మిని కాకినాడ డిపోకు చెందిన రాయచూర్- కాకినాడ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ నడిచి వెళుతున్న లక్ష్మిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా ప్రాంతాన్ని రావులపాలెం ఎస్సై చంటి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యులపై దాడి అమానుషం



గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఐఎంఏ సభ్యులు, వైద్యులు



రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్‌పై దాడి చేసిన ఆరుగురు నిందితులతో పోలీసులు

- రావులపాలెంలో వైద్యులు, సిబ్బంది నిరసన
- చట్టరీత్యా చర్యలకు ప్రజాప్రతినిధుల భరోసా

కొత్తపేట: రావులపాలెంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై దాడి చేసి వస్తువులు ధ్వంసం చేయడాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు, వివిధ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కోల్‌కతాలో వైద్యురాలి హత్యోదంతం, వైద్యలోకం ఆందోళన మరువక ముందే శుక్రవారం రావులపాలెంలో ప్రగతి నర్సింగ్ హోమ్‌లో వైద్యులు, సిబ్బందిపై దాడి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ, బాధితులకు అండగా నిలుస్తామని, నిందితులు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో జరిగిన ఈ దాడిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఖండించారు. ఆ మేరకు వైద్యులకు భరోసా కల్పిస్తూ మంత్రి సందేశాన్ని పంపినట్టు ఐఎంఏ సభ్యులు తెలిపారు. నిందితులు ఎవరైనా చర్యలు తప్పవని పేర్కొన్నారని అన్నారు.

- బాధిత ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కొత్తపేట శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కాశిన గేయానంద శేషుబాబు, డాక్టర్ కె.వీర్రెడ్డి, సభ్యులు డాక్టర్లు ఎం.గంగిరెడ్డి, మెంటే ఉదయ భాస్కరరావు, ఎంఆర్ఎల్ భీమారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కొత్తపేట, రావులపాలెం వైద్యులు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులకు శనివారం వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని కలసి వినతిపత్రం ఇచ్చారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని వైద్యులు కోరారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రునికి వైద్యం అందిస్తున్న సమయంలో వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడం అమానుష చర్య అని అన్నారు. ఆపద కాలంలో ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నానని అన్నారు. దోషులను శిక్షించే వరకూ వైఎస్సార్ సీపీ తరఫున డాక్టర్లకు తమ సహాయ సహకారాలు ఉంటాయని జగ్గిరెడ్డి భరోసా ఇచ్చారు.
- రావులపాలెంలో ప్రైవేట్ వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు వాడపాలెంలోని ఎమ్మెల్యే సత్యానందరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దీనిపై పోలీసు అధికారులతో మాట్లాడానని, నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వైద్యులపై దాడిని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఖండించారు.

ఆరుగురి అరెస్ట్

ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, క్షతగాత్రుడిపై దాడి చేసిన కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 6న సాయంత్రం రెండు మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న సమయంలో స్థానిక ప్రగతి నర్సింగ్ హోమ్‌పై, బాధితుడిపై, వైద్యులుపై దాడి చేసిన ఘటనలో ఆసుపత్రి వర్గాలు, బాధితుడు బుడ్డిగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. సీసీ పుటేజ్ ఆధారంగా దాడికి పాల్పడిన పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన చిటికెన బాలబాలాజీ, కుప్పాల సూర్యనారాయణ, కుప్పాల జయబాబు, దంగేటి వెంకట రామాదుర్గారావు, దిరిసిల చరణ్‌తేజ్, యర్రంశెట్టి సాయి హేమంత్ రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇలాంటి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కొత్తపేట: విద్యుత్ షాక్‌తో ఓ మృతి చెందినట్లు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజోలు మండలం శివకోడుపాలేనికి చెందిన శిరం మారుతీ సుబ్బారావు వివిధ ఉత్సవ పందిర్లలో 14 ఎంఎం వీధి సినిమాలు ప్రదర్శిస్తుండేవాడు. ఇందులో భాగంగా వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొత్తపేట మండలం మోడేకుర్రు బాలగణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో శనివారం రాత్రి సినిమా ప్రదర్శనకు సంబంధించి తెర కడుతుండగా సీరియల్ సెట్స్‌కు విద్యుత్ సరఫరా నిమిత్తం తగిలించిన పిన్నీసు తగలడంతో మారుతీ సుబ్బారావు (45) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతి చెందాడు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై సురేంద్ర మృతదేహాన్ని పరిశీలించారు. ఆదివారం మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల స్వైర విహారం



ముగ్గళ్లలో కుక్క కాటుకు గురైన మానస



చనిపోయిన గొర్రె

- 13 మందిపై దాడి
- ఒక గొర్రె మృతి

సీతానగరం: పిచ్చి కుక్కలు జనాన్ని బెంబేలెత్తించాయి. దొరికిన వారిపై దాడి చేశాయి. ఆ వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ముగ్గళ్ల, ఇనుగంటివారిపేటలకు చెందిన ఎస్సీ పేటల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రెండు పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ దొరికివారిపై దాడి చేశాయి. చిన్న పిల్లలతో పాటు వృద్ధుల వరకూ 13 మందిని కరిచాయి. జక్కల అంజనా కుమార్‌కు చెందిన రూ.10 వేల విలువైన గొర్రెను చంపేశాయి. ఐదేళ్ల మానిపాటి మానసను తీవ్రంగా గాయపరిచాయి. ఆరేళ్ల పాపను కరవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఈరెల్లి వెంకటేశ్వరరావు (70), ఇప్పర్తి కిట్టయ్య, నొక్కి రూప తదితరులు కుక్కకాటుకు గురై సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చికిత్స పొందారు. అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం 5 గంటలకు ఆ రెండు పిచ్చికుక్కలను స్థానిక యువకులు హతమార్చారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రహర్షకుమార్, దీప్తి ప్రియాంకలకు బహుమతులు అందిస్తున్న శేషారెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యంగ్మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ స్వర్ణన్‌రాజు స్మారక బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడ ఆదిత్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక ద్రోణ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో జూనియర్స్ సింగిల్స్ బాలికల విభాగంలో యాతం దీప్తిప్రియ విజేత కాగా, జూనియర్స్ బాలుర డబుల్స్‌లో యాతం ప్రహర్షకుమార్ రన్నర్‌గా నిలిచాడు. ఆదివారం రామారావుపేటలోని సిటీ టాబర్నికల్ చర్చిలో విజేతలకు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి బహుమతులు అందజేశారు. వీరిని వైఎంసీఏ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ పీఎం హెన్రీ, కార్యదర్శి, వైఎంసీఏ నేషనల్ బోర్డు మెంబర్ గాంధీ, దివంగత స్వర్ణన్‌రాజు సతీమణి విజయలక్ష్మి, పాస్టర్ చప్పిడి శామ్యూల్ విక్టర్, వెస్లీ, ఎస్తేరురాణి, రవికొర్ అభినందించారు.

నేడు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు

కాకినాడ సిటీ: వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం తెలిపారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా, పిల్లల భద్రత, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని కాకినాడ జిల్లా పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్టు వివరించారు.